E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 29-07-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టు ప్రశ్న » 3లో

# ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి


## తరలి రావాలని పిలుపు




- ఆగస్టు 5న పార్లమెంటులో వాయిదా తీర్మానాలు
- 6న జంతర్ మంతర్ వద్ద ప్రజా ప్రతినిధుల ధర్నా
- ఏడో తేదీన 200 మంది నాయకులతో రాష్ట్రపతి వద్దకు
- బీసీ రిజర్వేషన్ బిల్లులను వెంటనే ఆమోదించాలని వినతి

ఈ కబురు, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో ఆగస్టు 6న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆగస్టు ఏడో తేదీన ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి సహా లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత, రాజ్యసభ పక్షనేత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది.

తరువాయి 2లో



## ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ

» పార్లమెంట్‌లో సోమవారం కొనసాగిన రభస

» బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని రాజ్యసభలో పట్టుబట్టిన విపక్షసభ్యులు

» పార్లమెంట్ మకర ద్వారం ముందు విపక్షాల ఆందోళనలు

తరువాయి 2లో



## ప్రత్యేక రైలులో ఢిల్లీకి!

- ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు అందులోనే ప్రయాణం
- విలైతే.. పలువురు మంత్రులు కూడా అదే రైలులో..
- రాష్ట్రపతితో భేటీ తర్వాత పార్టీ అధిష్ఠానంతో చర్చించే అవకాశం

తరువాయి 3లో

అమ్మకాల ఒత్తిడి.. బేర్‌మన్న మార్కెట్లు » 4లో



చాలుచాల్లేవమ్మా.. చెబితే నమ్మేలా ఉండాలి.. » 5లో



అప్పటి 'షోలే' టికెట్ ఫోటోను అభిమానులతో పంచుకున్న బిగ్‌బీ » 5లో



చాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్ » 6లో





రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం తరువాయి 3లో



నేనే లేకపోతే.. భారత్ పాక్ యుద్ధంలో ఉండేవి..: ట్రంప్ తరువాయి 3లో



ఇస్రో–నాసా ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్ తరువాయి 3లో



» 2లో

## 31 నుంచి కాంగ్రెస్ పాదయాత్రలు, శ్రమదానం



## మార్పులేని మణిపూర్

» 3లో

హైకోర్టుకు నలుగురు

# కొత్త జడ్జీలు



» సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం

» జడ్జీలుగా మొహియుద్దీన్, చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్

» న్యాయవాదుల కోటా నుంచి నలుగురికి దక్కిన అవకాశం

» మొత్తంగా 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య.. ఇంకా 12 ఖాళీలు

తరువాయి3లో

# 18 ఏళ్ల తర్వాత..

## నెల ముందుగానే



» గరిష్ఠ స్థాయికి సాగర్ నీటిమట్టం

» నేడు ముగ్గురు మంత్రుల చేతుల మీదుగా నీటి విడుదల

» జలాశయంలో 584 అడుగులకు నీటిమట్టం

తరువాయి 2లో

## జమ్మూకశ్మీర్‌లో 'ఆపరేషన్ మహాదేవ్': ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హతం!

» 2లో



మొదటి పేజీ తరువాయి

# అంతరిక్షంపై చిన్నారుల్లో అమితాసక్తి



ఈకబురు: పహల్గాం ఉదంతం, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ జరపాలన్న విపక్షాల డిమాండ్లకు తలొగ్గి సోమవారం వివరణలతో చర్చను మొదలెట్టిన అధికార పక్షం, ప్రభుత్వ వివరణను తీవ్రంగా తప్పుబడుతూ విపక్షసభ్యులు చేసిన నినాదాలతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం తరపున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు లోక్‌సభలో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనను బలంగా వినిపించారు. ఇదే సమయంలో జైశంకర్ ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకోవడం, అడ్డుకున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతో సభలో ఆగ్రహావేశాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఓవైపు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపైనా చర్చ జరపాలని విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టారు. దీంతో సభ పలుమార్లు వాయిదా పడి చివరకు అర్థాంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడింది.పాక్ కాళ్లబేరానికి వచ్చిందితొలుత లోక్‌సభలో ఆపరేషన్‌సిందూర్‌పై చర్చపై రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. " ఆపరేషన్ సిందూర్ అనేది ముమ్మాటికీ చరిత్రాత్మకమైన సైనిక చర్య. ఉగ్రవాదంపై అత్యంత ప్రభావవంతమైన భారత విధానాన్ని ఈ ఆపరేషన్ ప్రపంచానికి చాటింది. యుద్ధరంగంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ధైర్యవంతులైన సైనికులందరికీ నా సెల్యూట్. పాక్ పౌరులకు, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పక్కా ప్రణాళికతో ఈ ఆపరేషన్‌కు పథకరచన చేశారు. కేవలం ఉగ్రవాదులకే భారీ నష్టం చేకూర్చాం. కేవలం 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి చేసి మన సత్తా చాటాం. ఊహించని మెరుపుదాడితో చేష్టలుడిగిన పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) స్వయంగా ఫోన్ చేసి తమకు ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యంలేదని స్పష్టంచేశారు. ఆలోపు పాక్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులను మన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా నిర్వీర్యంచేశాయి. మన దాడులకు ప్రతీగా పాక్ జరిపిన దాడుల్లో భారత్‌లో ఏ ఒక్క కీలక స్థావరం, ఆయుధాగారం దెబ్బతినలేదు. ఉగ్రవాదుల స్థావరాలు, వాళ్లకు మద్దతిచ్చే వాళ్లను అంతంచేసేందుకే ఆ ఆపరేషన్. లక్ష్యం నెరవేరిన కారణంగానే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశాం. ఇందులో ఎవరి బలవంతం, ప్రోద్బలం, ప్రమేయం లేవు. బయటిశక్తుల (అమెరికా, ట్రంప్) కారణంగానే పాక్‌పై మనం దాడులను ఆపేశామనడంలో వాస్తవం లేదు. భారత వాయుసేన అసాధారణ దాడులు, సరిహద్దు వెంట ఆర్మీ దీటైన జవాబుకు తోడు నావికాదళం దాడులకు దిగొచ్చన్న భయాలతో పాక్ కాళ్లబేరానికొచ్చింది'' అని రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. "మమ్మల్ని విపక్షాలు అడగదల్చుకుంటే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా? అని ఒక్కటే ప్రశ్న వేయాలి. అందుకే మేం అవును అని సూటి సమాధానం చెప్తాం. పాక్ దాడుల్లో మన సైనికులెవరూ వీరమరణం పొందలేదు. ఏ పరీక్షలోనైనా ఫలితమే ముఖ్యం. పరీక్ష రాసేటప్పుడు పెన్సిల్ విరగడము, కలం కనిపించకుండా పోవడమూ సాధారణం. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే ముఖ్యం. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సైనికదళాలు 100 శాతం కచ్చితత్వంతో సాధించాయి. పాక్‌తో గానీ మరే ఇతర దేశంతోగానీ ఎప్పుడూ విజయవంతమైన ప్రభుత్వాల సారథ్యంలో స్నేహాన్నే భారత్ కోరుకుంటోంది. గతంలో భారత్ 'లాహోర్ బస్సు యాత్ర' బాషలో మాట్లాడితే ధూర్త పాక్‌కు బోధపడలేదు. వాళ్లకు అర్థమయ్యేలా ఈసారి మేం 'బాలాకోట్ దాడి' భాషలో మాట్లాడాం. భారత్ ఏ దేశంతోనైనా కరచాలనం కోసం స్నేహహస్తమే అందిస్తుంది. చేతిని మెలిపెట్టాలని చూస్తేమాత్రం ఆ చేతినే విరిచేస్తుంది. పౌరుల ప్రాణాలకు హాని తలపెట్టాలని చూస్తే భారత్ ఏ స్థాయిలో విరుచుకుపడుతుంతో ఆపరేషన్ సిందూర్ కళ్లకుకట్టింది. భారత్‌ను ఏనాటికీ ఓడించలేమని పాక్ పాలకులకు అర్థమైంది. అందుకే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నారు. కానీ అది వాళ్లనే మింగేస్తోంది. అమాయక పాక్ ప్రజలనూ చంపేస్తోంది. ఆపరేషన్ ముగియలేదు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ సిందూర్ మొదలవుతుంది'' అని రాజ్‌నాథ్ అన్నారు.

**వాణిజ్య అంశాల్లో సిందూర్ ప్రస్తావన రాలేదు:**

జైశంకర్‌ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడారు. "ఆపరేషన్ సిందూర్ వేళ ట్రంప్, మోదీ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదు. అమెరికాతో వాణిజ్యానికి, ఈ ఆపరేషన్‌కు సంబంధం లేదు. ది రెసిస్టెంట్ ఫ్రంట్‌ను అంతర్జాతీయ ఉగ్రసంస్థగా ప్రకటించడంలో విజయంసాధించిన భారత దౌత్యానికి కృతజ్ఞతలు చెప్పాల్సిందే. మనం పాక్ నడిబొడ్డులోని బహావల్పూర్, మురిద్కేలోని స్థావరాలను నేలమట్టంచేయగలమని ఎవరైనా ఊహించారా?. పహల్గాం దాడిని బ్రిక్స్, క్వాడ్ కూటములేకాదు ఎన్నో దేశాలు ఖండించాయి. పాక్‌పై దాడిచేశాక దాడులను ఆపాలని పాక్ నుంచే అభ్యర్థన వచ్చింది. కానీ మేం పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) నుంచి అభ్యర్థన వస్తేనే ఆపుతామని చెప్పాం'' అన్నారు.

**ప్రతిపక్షాలపై అమిత్ షా ఆగ్రహం..**

విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తుంటే విపక్ష సభ్యులు పదేపదే అడ్డుత గిలారు. హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "ఆపరేషన్ సిందూర్‌పై మంత్రి జైశంకర్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ సభ్యులు అస్సలు విశ్వసించట్లేరు. బయటివాళ్లు (ట్రంప్) చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌కు నమ్మకం ఎక్కువ. మీ పార్టీలో విదేశీయుల అభిప్రాయాలకు ఎంతటి విలువుందో ఇప్పుడే తెలుస్తోంది. మీ అభిప్రాయాలను పార్లమెంట్‌పై రుద్దకండి. విదేశీయులను నమ్మినందుకే మీరు విపక్షంలో కూర్చున్నారు. ట్రంప్ వంటి విదేశీయుల మాటలను ఇలాగే నమ్ముతూ పోతే మీరు ఇలాగే మరో 20 సంవత్సరాలు విపక్షంలోనే ఉండిపోతారు'' అని వ్యాఖ్యానించారు.

**ప్రశ్నలు కురిపించిన కాంగ్రెస్**

చర్చలో కాంగ్రెస్ తరపున లోక్‌సభలో ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. " పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునే ఉద్దేశం మోదీ సర్కార్‌కు లేనట్లుంది. నిజంగా తిరిగి హస్తగతం చేసుకునే ఆలోచనే ఉంటే హఠాత్తుగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది?. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు పీఓకేను స్వాధీనంచేసుకుంటాం?. పాక్, భారత్ పరస్పర సైనిక చర్యలకు ముగింపు పలికింది తానేనని ట్రంప్ 26 సార్లు ప్రకటించుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?. భారత్, పాక్ యుద్ధం ఆపితేనే వాణిజ్యం కొనసాగిస్తానని ట్రంప్ అమెరికా వాణిజ్య కత్తిని చూపి బెదిరించారా?. ఇంట్లో చొరబడి మరీ చంపుతామని ఇప్పటికి ఎన్నోసార్లు మోదీ అదే డైలాగ్‌లు కొడుతున్నారు. మరి సిందూర్ పరిసమాప్తంకాలేదని, పాక్ దాడిచేస్తే మళ్లీ మొదలవుతుందని వాళ్లే చెబుతున్నారు. అలాంటప్పుడు సిందూర్ విజయవంతమైందని ఎలా అంటారు? యుద్ధం చేయడం తమ విధానం కాదంటారు? మరి సిందూర్‌వేళ చేసిందేంటి? వాళ్ల అధీనంలోని భూభాగాన్ని స్వాధీనంచేసుకోవడానికి సిందూర్ చేయలేదంటున్నారు. మరి దేని కోసం చేసినట్లు? సిందూర్ వేళ ఎన్ని యుద్ధవిమానాలను కోల్పోయాం?'' అని గొగోయ్ ప్రశ్నించారు.

**డిప్యూటీ ఛైర్మన్‌కు 26 నోటీసులు**

బిహార్ ఓటర్ల జాబితా అంశంతోపాటు ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలసకూలీలు వివక్షను ఎదుర్కొనే పలు అంశాలపై రాజ్యసభలో చర్చించాలంటూ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు మొత్తం 26 వాయిదా తీర్మానాలు వచ్చాయి. వీటన్నింటినీ ఆయన తోసిపుచ్చారు. జీరోఅవర్ సెషన్‌ను మొదలుపెట్టాలని నామినేటెడ్ సభ్యురాలు సుధామూర్తిని హరివంశ్ కోరగానే విపక్షసభ్యులు ఆందోళన పెంచారు. ఓటు చోరీని ఆపాలి అని నినాదాలుచేశారు. దీంతో మధ్యాహ్నం సెషన్‌లోపే సభ రెండుసార్లు వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే పునరావృతమైంది. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా విపక్షసభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలిస్తూ సభ జరక్కుండా అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక సభను మంగళవారానికి వాయిదావేశారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రత్యేక రైలులో ఢిల్లీకి!



ఈ కబురు ,హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఢిల్లీ వేదికగా కేంద్రంపై ఒత్తిడి చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలోనే ఉండి కేంద్రంతో సంప్రదింపులు జరపాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆగస్టు 6న జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేయాలని తీర్మానించింది. ఇందుకు ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులంతా ఆ ప్రత్యేక రైలులోనే వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. వీలైతే మంత్రులు కూడా దానిలోనే వెళ్లనున్నట్టు తెలిసింది. క్యాబినెట్ సహా నాయకులంతా మూడు రోజులపాటు ఢిల్లీలోనే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్ల పర్యవేక్షణకు బీసీ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు రెండ్రోజుల ముందుగానే హస్తినకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని నిర్ణయించింది. అలాగే, రాష్ట్రపతిని కలిసిన తర్వాత అదే రోజు పార్టీ అధిష్ఠానంతో కీలకంగా చర్చించనున్నారని తెలిసింది. అధిష్ఠానం సూచనల మేరకు రిజర్వేషన్ల అంశంపై ముందుకెళ్లనున్నట్టు సమాచారం.

# జమ్మూకశ్మీర్‌లో 'ఆపరేషన్ మహాదేవ్': ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హతం!

ఈ కబురు: జమ్మూకశ్మీర్‌లో సోమవారం జరిగిన 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం దాడితో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను సైనిక దళాలు మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించినట్లు ఆల్‌ఇండియా రేడియో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. మరోవైపు హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు గతేడాది సోనామార్గ్ టన్నెల్‌లో జరిగిన ఉగ్రదాడికి కారకుడు కాగా, మరొకడు పహల్గాం ఉగ్రదాడిలో అనుమానితుడిగా పీటీఐ కథనంలో పేర్కొంది.

హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలిలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కర మూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది.ఈ స్థావరంలో మొత్తం ఐదు నుంచి ఏడుగురు ఉగ్రవాదులున్నట్లు సమాచారం. చిక్కటి అరణ్యంలో ఓ గొయ్యి తవ్వి దానిపై టెంట్ వేసుకొని వీరు నక్కారు. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన భద్రతా దళాలకు లిడ్వాస్ ప్రాంతంలో తొలిసారి ఉగ్రవాదులు భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ కూడా 'ఎక్స్'లో ధ్రువీకరించింది. ఇప్పటికే పహల్గాం ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన పర్వేజ్ అహ్మద్ జోథార్, బషీర్ అహ్మద్‌లను గత నెల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

ఆపరేషన్‌కు ఈ పేరు ఎందుకు..?

దాచిగామ్ సమీంలోని మహాదేవ్ పర్వతం ఆధారంగా ఈ ఆపరేషన్‌కు పేరు పెట్టారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రదేశం జబర్వన్‌మహాదేవ్ పర్వతాల మధ్య జరుగుతోంది. అందుకే ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులే.. వీరు లష్కరే తయిబాకు చెందినవారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఘటనాస్థలంలో ఏకే47 రైఫిల్‌స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. దళాలు వేగంగా స్పందించి చర్యలు తీసుకొన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడినుంచి పరారయ్యారు. అప్పటినుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. వీరిలో ఒక్కొక్కరి తలపై రూ.20లక్షల వరకు రివార్డును ఇప్పటికే ప్రకటించారు.

ఇటు పార్లమెంటులో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండటం, అదే సమయంలో ఆపరేషన్ మహాదేవ్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో దీని గురించి గూగుల్‌లో వీటికి సంబంధించిన వార్తలు ట్రెండ్ అవుతున్నాయి.

# 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే



**ఈ కబురు, నల్గొండ -,నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షా లతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో నాగార్జునసాగర్ జలాశయం జలకళతో తొణికిసలాడుతోంది. గతానికి భిన్నంగా జులై నెలలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఇలా జరగడం 18 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి. సాధారణంగా ఆగస్టులో సాగర్ నిండుతుంది. పైనుంచి వరద కొనసాగుతుండటంతో అధికారులు మంగళవారం 6 క్రస్ట్ గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని ముగ్గురు మంత్రుల చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం... శ్రీశైలం నుంచి 1,47,195 క్యూసెక్కుల వరదనీరు సాగర్‌కు చేరడంతో నీటిమట్టం 584.70 అడుగులకు చేరింది. ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా 5,394 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,634 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల చొప్పున మొత్తంగా 42,613 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా ప్రస్తుతం 296.56 టీఎంసీల నీరుంది.**

**నాగార్జునసాగర్ నీటిమట్టం మంగళవారం ఉదయం 10 గంటలకు 586 అడుగులను దాటే అవకాశముంది. ఈ నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు.**

# ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు




ఈ కబురు, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో ఆగస్టు 6న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆగస్టు ఏడో తేదీన ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి సహా లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత, రాజ్యసభ పక్షనేత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. నాలుగున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించారు.అనంతరం మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుటుంబాలవారీగా సర్వే చేశాం. సర్వే నివేదికను సబ్ కమిటీ ద్వారా పరిశీలింపజేశాం. ఏడాదిలోపులోనే క్యాబినెట్ కూడా దానిని ఆమోదించింది. ఆ తర్వాత మార్చిలో.. స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను అన్ని పార్టీల సహకారంతో శాసనసభలో ఆమోదించాం. వాటిని మార్చి 22న గవర్నర్ ఆమోదం కోసం పంపాం. మార్చి 30న గవర్నర్ వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. అదే సమయంలో, పంచాయతీరాజ్ చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ ఈనెల 10న ఆర్డినెన్స్‌ను తయారు చేసి, 14న గవర్నర్‌కు పంపించాం. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపినందున.. ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాం. దీనిని కూడా ఆయన రాష్ట్రపతికి పంపించినట్లు మాకు సమాచారముంది. తప్పకుండా సానుకూల నిర్ణయం వస్తుందని వేచి చూస్తున్నాం'' అని పొన్నం ప్రభాకర్ వివరించారు. అందుకే మూడు రోజులపాటు ఢిల్లీలో ఉండి, రాష్ట్రపతిని కలవాలని క్యాబినెట్‌లో నిర్ణయించామని తెలిపారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు, పార్టీకి చెందిన 100 మంది ఎంపీలం రాష్ట్రపతిని కలవాలనుకుంటున్నామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులందరం ఢిల్లీకి వెళుతున్నామని, బీసీ మేధావులు, బీసీ నాయకులు, కుల సంఘాల నాయకులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. 42% రిజర్వేషన్లు ఆశించే ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేశారు.

**బీజేపీ ఎంపీలూ.. సహకరించండి**

"స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు తేదీలను ప్రకటిస్తోంది. కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి ద్వారా బిల్లులను ఆమోదింపజేయాలని కేంద్రాన్ని క్యాబినెట్ ముక్త కంఠంతో కోరుతోంది. రాష్ట్రంలో అర్వింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, కృష్ణయ్య, లక్ష్మణ్ వంటి ఐదుగురు బీజేపీ బీసీ ఎంపీలున్నారు. పాయల్ శంకర్ బీసీ ఎమ్మెల్యేగా ఉన్నారు. రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులను ఆమోదింపజేసుకురమ్మని వీరందరినీ అడుగుతున్నాం'' అని పొన్నం విజ్ఞప్తి చేశారు. కానీ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వంటివారు విమర్శిస్తున్నారని, వాటిని బీజేపీ బీసీ నేతలు ఖండిస్తారనుకున్నామని వ్యాఖ్యానించారు. 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో శాసన సభ, ఇతర వేదికలపై అందరికీ విజ్ఞప్తి చేశామని, కానీ.. రాజకీయ పార్టీలు అహేతుకంగా ఉంటున్నాయని, నిజాయితీగా వ్యవహరించడం లేదని తప్పుబట్టారు. శాసన సభలో బిల్లులకు ఆమోదం తెలిపి.. ఢిల్లీకి వెళ్లేసరికి మోకాలడ్డుతున్నాయని, కడుపులో కత్తులు పెట్టుకుని, అలుముకుని చంపాలని ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయంగా బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అయినా... కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. "ఇది ఎవరికీ వ్యతిరేకం కాదు. కిషన్ రెడ్డి స్థానంలో బీసీకి మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారు. కిషన్‌రెడ్డే మంత్రిగా ఉండాలి. కానీ.. బీసీ రిజర్వేషన్లకు మద్దతివ్వాలి. దీనికి ఆర్.కృష్ణయ్య నాయకత్వం వహించాలి. మీ పార్టీ ఎంపీలను ఒప్పించి, ఢిల్లీకి తీసుకురావాలి. మాకు భేషజాలు లేవు. మీ వద్దకు రావడానికి సిద్ధంగా ఉన్నాం'' అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంకంటే బీసీ నాయకులపైనే ఎక్కువ బాధ్యత ఉందని, దీనికి సహకరించాలని పేరుపేరునా కోరుతున్నామని అన్నారు. "మేం అవివేకంగా 42 శాతం కావాలని అడగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా సర్వే చేసింది. విమర్శలు రాకుండా మరోసారి నమోదు చేసింది. క్యాబినెట్ చర్చించింది. అయితే, బిల్లులకు రాష్ట్రపతి వద్ద కాలయాపన జరుగుతోంది. వాటిని త్వరగా ఆమోదించాలని కోరుతున్నాం'' అని వ్యాఖ్యానించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనతోనే 50 శాతం పరిమితి తొలగిపోయిందని, ప్రస్తుతం బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 10%, ఈడబ్ల్యూఎస్‌లకు 10% చొప్పున మొత్తం 64% రిజర్వేషన్లు నడుస్తున్నాయని వివరించారు.

**అప్పుడు తెలియదా?**

"50 శాతం పరిమితి గురించి రాంచందర్‌రావు మాట్లాడుతున్నారు. కానీ, ఎంపిరికల్ డేటా ఉంటే.. రాష్ట్రాలు ముందుకు వెళ్లొచ్చని ఇందిరా సాహ్నీ కేసులో స్పష్టంగా చెప్పారు'' అని మంత్రి పొన్నం గుర్తు చేశారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని రాంచందర్‌రావు వంటివారు ఇప్పుడు మాట్లాడుతున్నారని, మరి, శాసన సభలో బిల్లులను ఆమోదించినప్పుడు ఆ విషయం బీజేపీ నాయకులకు తెలియదా? అని నిలదీశారు. అసెంబ్లీలో మద్దతు ఇచ్చినందుకు రాంచందర్‌రావు అయినా బీజేపీ ఎమ్మెల్యేలైనా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సీఎం అంటూ ప్రకటించారని, శాసనసభాపక్ష నేత పదవిని బీసీకి ఇవ్వలేదని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నేత ఉంటే తొలగించారని తప్పుబట్టారు. కిషన్ రెడ్డిని రాజీనామా చేయాలని అడగడం లేదని, రిజర్వేషన్లకు మద్దతివ్వాలని కోరుతున్నామని అన్నారు.

**క్యాబినెట్ తీసుకున్న ఇతర నిర్ణయాలు**

రవాణా శాఖకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఇకపై సిబ్బందితో కాకుండా వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగుతుంది.

**కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతోపాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేస్తూ నిర్ణయం తీసుకుంది.**

**బీసీలకు కేసీఆర్ ద్రోహం చేశారు**

గతంలో పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ బీసీలకు తీరని ద్రోహం చేశారని క్యాబినెట్ ఆక్షేపించింది. "అన్ని సామాజిక వర్గాల రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో ప్రత్యేక నిబంధనను పొందుపర్చారు. కేసీఆర్ తెచ్చిన ఈ చట్టం బీసీల రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారింది. కేసీఆర్ బీసీలకు చేసిన ద్రోహాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. జూలై 10న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆ చట్టాన్ని సవరించాలని నిర్ణయం తీసుకుంది. చట్ట సవరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకురావాలని తీర్మానించింది. చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ నిబంధనను ఎత్తివేసేలా సవరణ ఆర్డినెన్స్ ఫైలును ఈనెల 14న గవర్నర్‌కు పంపింది. గవర్నర్ దీనిని రాష్ట్రపతి పరిశీలనకు పంపించినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. అందుకే, రెండు బిల్లులు, ఆర్డినెన్సును వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతికి క్యాబినెట్ విజ్ఞప్తి చేస్తోంది'' అని ప్రభుత్వం ఓ ప్రకటనలో వివరించింది. కాగా, వ్యక్తిగత కారణాలతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశానికి హాజరు కాలేదు.

# 31 నుంచి కాంగ్రెస్ పాదయాత్రలు, శ్రమదానం

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి వారం పాటు ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలు పాదయాత్రలు, శ్రమదానం నిర్వహించనున్నారు. ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఈ కార్యక్రమాల ద్వారా తొలిసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల్లో ముఖ్యనేతలు పాల్గొననున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. ఈనెల 31న ఈ కార్యక్రమం పరిగి నియోజకవర్గం నుంచి ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి ప్రతిరోజు ఒక్కో ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలను నేతలు తెలుసుకుంటారు. ప్రతి నియోజకవర్గంలో ఒకరోజు రాత్రి బసచేసి, శ్రమదానంలో పాల్గొంటారు. జులై 31, ఆగస్టు 1 తేదీల్లో పరిగి(ఉమ్మడి రంగారెడ్డి జిల్లా), 2వ తేదీన అందోల్(ఉమ్మడి మెదక్), 3న ఆర్మూర్(నిజామాబాద్), 4న ఖానాపూర్(ఆదిలాబాద్), 5న చొప్పదండి (కరీంనగర్), 6న వర్ధన్నపేట(వరంగల్) నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈనెల 31న పరిగి నియోజకవర్గంలోని రంగాపూర్‌లో సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం శ్రమదానం కార్యక్రమం ఉంటుంది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు సహా ప్రజాప్రతినిధులు పాల్గొనేలా పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఈసందర్భంగా స్థానిక సంస్థల్లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై స్థానిక నేతలతో మీనాక్షి నటరాజన్ ముఖాముఖి మాట్లాడతారు. పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల విజయవంతానికి పీసీసీ.. పార్టీ తరఫున సమన్వయకర్తలను నియమించింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు.

నేడు మీనాక్షి సమావేశాలు

మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి పీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జులు, డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ప్రధాన కార్యదర్శులతో మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ముఖాముఖి సమావేశమై స్థానిక ఎన్నికల సన్నద్ధతపై మాట్లాడతారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని మీనాక్షి క్యాంప్ కార్యాలయంలో సమావేశాలు జరగనున్నాయి. ప్రతి జిల్లాలో పార్టీలో ఉన్న సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, నామినేటెడ్ పదవులకు అర్హుల గుర్తింపు తదితర అంశాలపై నేతలతో మీనాక్షి చర్చించనున్నారని పార్టీవర్గాలు తెలిపాయి.



మొదటి పేజీ తరువాయి

# నేనే లేకపోతే.. భారత్ పాక్ యుద్ధంలో ఉండేవి..: ట్రంప్



ఈ కబురు: భారత పార్లమెంటులో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ జరుగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదే పాత పాట పాడారు. తానే గనుక సకాలంలో జోక్యం చేసుకోకపోతే.. భారత్ పాకిస్థాన్‌లు ఈపాటికి యుద్ధంలో ఉండేవని వ్యాఖ్యానించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. ఇటీవల కాలంలో తాను ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రధాన యుద్ధాలను నివారించినట్లు చెప్పుకోవడం గమనార్హం.

"ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయి. నేనే లేకుంటే.. ఆరు పెద్ద యుద్ధాలు జరగుతుండేవి. ఇందులో భారత్ పాకిస్థాన్ ఘర్షణ అతిపెద్దది. ఎందుకంటే.. ఇవి రెండూ అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వాయుధాలు ప్రయోగించుకుంటే.. యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి దారుణ పరిస్థితులు నెలకొనేవి. ఇరుదేశాల నేతలు నాకు చాలా బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే.. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని చెప్పాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

భారత్ పాక్‌ల మధ్య తానే యుద్ధం ఆపానంటూ ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, ఈ వ్యవహారంలో అమెరికా పాత్ర లేదని భారత్ ఖండిస్తూ వస్తోంది. పార్లమెంటులో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోదీ, ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 3న వీరి పేర్లను సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ జారీ చేసింది. దీంతో వీరు అదనపు న్యాయమూర్తులుగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కొత్త జడ్జీలుగా నియమితులైన నలుగురు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మతో కలసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం హైకోర్టులో 26 (సీజేతో కలిపి) మంది న్యాయమూర్తులున్నారు. ఈ నలుగురి ప్రమాణం స్వీకారం తర్వాత ఆ సంఖ్య 30కి చేరనుంది. ఇంకా 12 పోస్టులు ఖాళీగా ఉంటాయి. కాగా, సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. ఈ బదిలీలకు కేంద్రం ఇంకా ఆమోదం తెలుపలేదు. అలాగే తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

సుద్దాల చలపతిరావు..

చలపతిరావు 1971, జూన్ 25న జనగాంలో జన్మించారు. 1998, మార్చి 26న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది వై.రామారావు వద్ద 1998 నుంచి 2004 వరకు జూనియర్‌గా పనిచేశారు. 2004 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సిటీ సివిల్ కోర్టులతోపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల కేసులు వాదించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

వాకిటి రామకృష్ణారెడ్డి

రామకృష్ణారెడ్డి 1970, సెప్టెంబర్ 14న జన్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు స్వగ్రామం. వీరిది వ్యవసాయ కుటుంబం. తండ్రి సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించారు. తల్లి గృహిణి. బీకామ్ ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది ఎ.అనంతసేన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2005 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతోపాటు తెలంగాణ, ఏపీ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, ఫ్యామిలీ, కంపెనీ లా విభాగాల్లో సమర్థుడిగా పేరు పొందారు. 2016-17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈడీ స్టాండింగ్ కౌన్సిల్ విధులు నిర్వహిస్తున్నారు.


గౌస్ మీరా మొహియుద్దీన్..

గౌస్ 1969, జూలై 15న జన్మించారు. హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందినవారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్‌గా పనిచేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 1993 మార్చి 17న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించారు. సివిల్, రాజ్యాంగంతోపాటు పలు విభాగాల్లో సమర్థ వాదనలు వినిపించారు.

గాడి ప్రవీణ్‌కుమార్...

ప్రవీణ్‌కుమార్ 1971, ఆగస్టు 28న జన్మించారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ స్వస్థలం. కాకతీయ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1998, నవంబర్ 12న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్, లేబర్ కోర్టుల్లో పలు కేసులు వాదించారు. రాజ్యాంగం, సర్వీస్ మ్యాటర్, లేబర్ లా, క్రిమినల్ లా.. వంటి పలు విభాగాల్లో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

# కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టు ప్రశ్న



ఈ కబురు, ఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా జలాలపై వివాదం నేపథ్యంలో మీరు ఎటువైపు ఉన్నారంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సన్నివేశం సోమవారం చోటుచేసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగిస్తూ కేంద్రం 2021, 2022లలో జారీచేసిన నోటిఫికేషన్‌లపై స్టే ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్ర నోటిఫికేషన్ల ప్రకారమే ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని, దీనిపై తుది నిర్ణయం వచ్చేవరకు తెలంగాణ జారీ చేసిన జీవో-34ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం రెండు వేర్వేరు రిట్‌పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఇదివరకు విచారణ జరిపిన జస్టిస్ అభయ్ ఎస్.ఓక పదవీ విరమణ చేయడంతో సోమవారం ఈ కేసులు జస్టిస్ రాజేష్ బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. తొలుత తెలంగాణ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ జోక్యం చేసుకుంటూ వీటికి కొంత సమయం పట్టే అవకాశమున్నందున సెప్టెంబరులో తీసుకోవాలని కోరారు. అప్పుడు జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ఎక్కడున్నారని ప్రశ్నించారు. తాము హాజరైనట్లు న్యాయవాది స్పందించడంతో "మీరు ఎక్కడున్నారు? అటువైపా, ఇటువైపా... లేదంటే మధ్యనా?" అని జస్టిస్ రాజేష్‌బిందల్ ప్రశ్నించారు. దాంతో న్యాయవాది 'మధ్యస్థం' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. అప్పుడు జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ మీరిప్పుడు ఉత్తర్వులు జారీ చేశారా? లేదంటే చేయడం లేదా? అని ప్రశ్నించగా... తామెలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదన్నారు. ఏపీ తరపు న్యాయవాది ఉమాపతి జోక్యం చేసుకుంటూ వారు 2021లోనే నోటిఫికేషన్ జారీ చేశారని, దాన్ని అమలు చేయాలని కోరుతూ తాము రిట్‌పిటిషన్ వేశామన్నారు. తెలంగాణ న్యాయవాది స్పందిస్తూ "కేఆర్ఎంబీ కేంద్ర ఉత్తర్వులను అమలు చేసే స్థితిలో లేదు. వాస్తవానికి ఇరురాష్ట్రాల సీఎంలు ఇటీవల జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సమస్యలను కమిటీకి ప్రతిపాదించారు" అని తెలిపారు. అప్పుడు ఏపీ ప్రభుత్వ న్యాయవాది జైదీప్‌గుప్త జోక్యం చేసుకుంటూ ఈ కేసు పూర్తిస్థాయి విచారణకు సమయం పడుతుందని గత ధర్మాసనం చెప్పడంతో తాము మధ్యంతర ఉపశమనం కోరామని, అందువల్ల తొలుత దానిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. వైద్యనాథన్ జోక్యం చేసుకుంటూ ఏపీ పిటిషన్‌కున్న విచారణార్హతపైనా వాదనలు వినాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం ఈ కేసుల విచారణను వచ్చేనెల 19కి వాయిదా వేసింది.

మొదటి పేజీ తరువాయి

# 'చినార్ కోర్' ధైర్యసాహసాలు నిరుపమానం: లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్




ఈ కబురు: జమ్మూకశ్మీర్‌లో సోమవారం జరిగిన 'ఆపరేషన్ మహాదేవ్'లో శౌర్య పరాక్రమాలు ప్రదర్శించిన చినార్ కోర్ (మిలటరీ యూనిట్)ను డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అభినందించారు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ప్రాణాలకు తెగించిన వారి పోరాట పటిమ నిరుపమానమన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. శ్రీనగర్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. వారిలో పహల్గాం ఉగ్రదాడి వ్యూహకర్త సులేమాన్ షా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు చేపట్టినప్పుడు భద్రతా బలగాలు ఎదుర్కొనే కఠిన సవాళ్లను ఈ సందర్భంగా రాజీవ్ ఘాయ్ ప్రస్తావించారు. "కొన్నిసార్లు పరిస్థితులు శత్రువులకు అనుకూలంగా మారుతాయి. అలాగని, వెనకడుగు వేయలేం. ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వస్తుంది. ఈ విషయంలో చినార్ కోర్ ధైర్యసాహసాలు అమోఘం. ఉగ్రవాదులను మట్టికరిపిస్తుందని వీళ్లకు వీళ్లే సాటి అని ఎప్పటికి మర్చిపోవద్దు. భారత సైన్యంలోని పరాక్రమయోధులకు సెల్యూట్" అంటూ రాసుకొచ్చారు.

హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలికలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కరమూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది.

# రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం

» వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై సుప్రీంలో బలమైన వాదనలు వినిపించాలని నిర్ణయం
» 5న కేసు సుప్రీంకోర్టు ముందుకు రానుండటంతో మంత్రివర్గంలో చర్చ
» తక్షణమే ఏజీతో చర్చించాలని వైద్య మంత్రికి సీఎం సూచన

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా తీసుకొచ్చిన జీవో నంబరు 33పై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైద్య విద్యలో 'తెలంగాణ స్థానికత' వివాదంపై కేసు ఆగస్టు 5న సుప్రీంకోర్టులో విచారణకు రానుండడంతో.. సోమవారం మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చకొచ్చింది. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశం కావడంతో... వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దీన్ని మంత్రివర్గంలో ప్రస్తావించారు. మంత్రిమండలిలో చర్చించిన అనంతరం... ఇదే అంశంపై అత్యవసరంగా అడ్వొకేట్ జనరల్(ఏజీ)తో చర్చించాలని దామోదర్ రాజనర్సింహకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. దాంతో మంత్రివర్గ సమావేశం జరుగుతుండగానే ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు సంబంధించి 'స్థానికత' అంశంపై చర్చించేందుకు ఆయన సోమవారం హైటెక్ సిటీలోని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. మంత్రి వెంట ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ కూడా ఉన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా కోర్టులో వాదనలు వినిపించాలని, అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని ఏజీని మంత్రి సూచించారు.

ఏమిటి ఈ స్థానికత గొడవ?

వైద్య విద్యలో... ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరడానికి రాసే నీట్ పరీక్షకు ముందు... వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వారినే ఇక్కడ స్థానికులుగా స్పష్టంచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024 జులై 19న జీవో ఇచ్చింది. దీని ప్రకారం తెలంగాణ స్థానిక కోటాలో వైద్య విద్యలో సీటు పొందాలంటే... ఇక్కడ 9, 10, 11, 12 తరగతులను వరుసగా చదివి ఉండాలి. అంతకుముందున్న స్థానికత ఉత్తర్వుల్లో... 6 నుంచి 12వ తరగతి వరకు మెజార్టీ విద్యను తెలంగాణలో చదివితే సరిపోయేది. అంటే ఏడేళ్లలో గరిష్ఠంగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వారికి ఇక్కడ స్థానికులుగా అర్హత లభిస్తుంది. ఈ కోటాలో 85% సీట్లు, అన్‌రిజర్వుడ్ కోటాలో 15% సీట్లు ఉండేవి. గత పదేళ్లపాటు ఉమ్మడి రాష్ట్ర నిబంధనలనే వర్తింపజేయడంతో 15% సీట్లలో తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులూ పోటీ పడేవారు. ఇప్పుడు పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో 15% అన్‌రిజర్వుడ్ సీట్లు తీసేసి.. మొత్తం 100% సీట్లను తెలంగాణ విద్యార్థులకే వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జీవో తీసుకొచ్చింది.

విద్యా శాఖలో... బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ వెటర్నరీ సైన్స్ లాంటి అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ స్థానికత అంటే గతంలో మాదిరిగా 6 నుంచి 12వ తరగతి చదువును ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందులో తొలుత 9 నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్ల చదువును చూస్తారు. ఒకవేళ 9 నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్ల చదువు తెలంగాణలో లేకుంటే... 6 నుంచి ఇంటర్ వరకు ఏడేళ్లలో నాలుగేళ్లు రాష్ట్రంలో చదవాలి. అంటే 6 నుంచి 9వ తరగతి వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు చదివినా స్థానికుడిగా పరిగణిస్తారు. వీరికి 85% సీట్లను కేటాయిస్తారు. అన్ రిజర్వుడ్‌గా పిలిచే స్థానికేతర కోటా 15 శాతానికి రాష్ట్రంలో చదివిన పిల్లలతోపాటు గతంలో మాదిరిగానే మరో మూడు కేటగిరీల వారూ పోటీపడొచ్చు. ఒకవైపు కోర్టులో తుది నిర్ణయం రాకముందే... అడ్మిషన్ల ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు గతేడాది స్థానికత వివాదంలో కోర్టును ఆశ్రయించిన సుమారు 100 మందికి వైద్యవిద్యలో సీట్లు కేటాయించారు. ఇది జరిగి ఏడాది గడిచింది. ఇప్పుడు మళ్లీ అదే జీవోతో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో... మరోసారి విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణవాసులమైనా వేర్వేరు కారణాలతో ఇతర రాష్ట్రాల్లో 9, 10 తరగతులు చదివితే... స్థానికత వర్తించడం లేదని, తమకు అన్యాయం జరుగుతోందంటూ తెలంగాణ విద్యార్థులు కోర్టుకు విన్నవిస్తున్నారు. పైగా విద్యాశాఖ తరహాలో 15% అన్‌రిజర్వుడ్ కోటా ఉంటే... ఒకవేళ ఇతర రాష్ట్రాల్లో చదివినా తెలంగాణవాసులైతే ఆ కోటాలో సీటు పొందే అవకాశముండేదని వారు చెబుతున్నారు. తెలంగాణ ఆరోగ్యశాఖ మాత్రం... ఏడేళ్ల వ్యవధిలో గరిష్ఠంగా నాలుగేళ్లను పరిగణనలోకి తీసుకుంటే.. కొందరు విద్యార్థులు నాలుగేళ్లు చదవకపోయినా 6, 7 లేదా 8, 9 తరగతులు ఇక్కడే చదివినట్లు తప్పుడు ధ్రువపత్రాలతో వైద్యవిద్యలో సీట్లు పొందుతున్నారని, ఇదే వ్యవహారం కాళోజీ వర్సిటీ పరిశీలనలోనూ వెల్లడైందని చెబుతోంది. అందుకే తాము 9 నుంచి 12 వరకు వరుసగా తెలంగాణలోనే చదివి ఉండాలనే నిబంధన తీసుకొచ్చామంది.



మొదటి పేజీ తరువాయి

# మార్పులేని మణిపూర్



ఈ కబురు: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలనను మరో ఆర్నెల్లు పొడిగించాలని కేంద్రం నిర్ణయించుకుంది..

రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడ్డాయన్న కేంద్రం వాదన సరైనదే అయినప్పుడు ఈ కొనసాగింపు అవసరం నిజానికి ఉండకూడదు. పగ్గాలు మరో ఆర్నెల్లు కేంద్రం చేతిలోనే ఉండాలని అనుకుంటున్నారంటే, రాష్ట్రం ఇంకా గాడినపడలేదని ఒప్పుకున్నట్టే. తమకు ఎంతో ప్రీతిపాత్రుడైన బీరేన్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే మణిపూర్ తొలి ఆర్నెల్ల రాష్ట్రపతి పాలనలో మెరుగుపడిందనీ, మరికొంత కాలం ఇలాగే తమచేతుల్లోనే కొనసాగితే పూర్తిగా బాగుపడిపోతుందని కేంద్రం తాను నమ్ముతూ, మననూ నమ్మమంటున్నదేమో! వచ్చే ఏడాది ఫిబ్రవరి 13వరకూ వర్తించబోయే ఈ కొనసాగింపుతో మణిపూర్ ఏడాది రాష్ట్రపతిపాలన పూర్తిచేసుకుంటుంది. రెండేళ్లపాటు మతాల మధ్య చిచ్చురాజేసి, రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేసిన ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాజీనామా చేయడంతోనే రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలన్నీ కుప్పకూలి, యంత్రాంగం నిర్వీర్యమై, అరాచకం ప్రబలిపోవడంతో ఇక నేరుగా రాష్ట్రాన్ని గుప్పిట్లోకి తీసుకోకతప్పదని కేంద్రం భావించింది. సంక్షోభ నివారణకు ఉద్దేశించిన తాత్కాలిక చర్యగా ప్రజలు రాష్ట్రపతిపాలనను భావిస్తారు కనుక, సాధ్యమైనంత త్వరలో దానిని ఎత్తివేసి ప్రజాప్రభుత్వాన్ని నెలకొల్పే పని మొదలవుతుందని కూడా ఆశిస్తారు. అయితే, మణిపూర్ విషయంలో కేంద్రం నిర్ణయం ఇందుకు విరుద్ధంగా ఉన్నందున, రాష్ట్రంలో శాంతిభద్రతలను ప్రతిష్ఠించి, సమాజాన్ని సాధారణస్థితికి తెచ్చే కృషిలో ప్రభుత్వ ప్రయత్నాలు పరిపూర్ణంగా ఫలించలేదని అనుకోవాలి.

బీరేన్‌సింగ్ దిగినవెంటనే రాష్ట్రంలో పరిస్థితులు మారిపోతాయన్న భ్రమలు ఎవరికీ లేవు. ఆఖరు నిముషం వరకూ ఆయన ముఖ్యమంత్రిగా కాక, ఒక మీతీ నాయకుడిలాగానే వ్యవహరించడంతో, రాష్ట్రం మతవిద్వేషాలతో భగ్గుమన్నది, మీతీలకూ కుకీ-జో తెగలకు మధ్య అవిశ్వాసం పతాకస్థాయికి చేరింది. పోలీసు బలగాలను మీతీ మిలిటెంట్ గ్రూపుల జోలికి పోకుండా నిరోధించారాయన. 'వాళ్ళను ఆయుధాలు దోచుకోనివ్వండి' అంటూ మీతీలపక్షాన ఆయన చేసిన వ్యాఖ్యలు ఆడియో టేపుల రూపంలో లీకై, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయి, ఆ గొంతు బీరేన్‌దేనని నిర్ధారణ జరిగి, తనతోపాటు బీజేపీ పెద్దలు పరువుకూడా తీశారు. బీరేన్‌ను తప్పిస్తే తప్ప, హింసకు అడ్డుకట్టపడదని, పరిస్థితులు మారవని మీతీయేతర జాతులూ తెగలూ 2023 నుంచీ మొత్తుకుంటూనే ఉన్నాయి. అయినా, ఢిల్లీ పెద్దలు దిగిరాలేదు. రెండేళ్ళపాటు ఆయన చిత్తం వచ్చినట్టు వ్యవహరించాడు. ఎప్పుడైతే బీరేన్‌కు వ్యతిరేకంగా పార్టీలోనే నిప్పురాజుకొని, స్పీకర్ కేంద్రంగా తిరుగుబాటు రాజకీయం సాగి, కాంగ్రెస్ ఎత్తులతో బీజేపీప్రభుత్వం కూలిపోవడం ఖాయమని తేలిపోయిందో, కేంద్రం ఆయనను నిర్దాక్షిణ్యంగా వదిలించుకుంది. అవిశ్వాసతీర్మానానికి తావులేకుండా ఢిల్లీపెద్దలు రాష్ట్రపతిపాలన విధించి, రాష్ట్రం చేజారిపోకుండా జాగ్రత్తపడ్డారు. బీరేన్ నిష్క్రమణ తరువాత, హింస క్రమంగా నియంత్రణలోకి వచ్చింది, ఆయుధాల స్వాధీనం కూడా జోరందుకుంది. ఇటీవల మీతీ రాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' నాయకుడు కనాన్ సింగ్‌ను సైతం సీబీఐ అరెస్టుచేసింది. అప్పుడు కాస్తంత హింస రేగినా, గతంతో పోల్చితే మీతీల జోరుతగ్గి, కుకీ-జో తెగల విశ్వాసం పెరిగింది.

# ఇస్రో–నాసా ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్



**రేపు సాయంత్రం జీఎస్ఎల్‌వీ ఎఫ్–16 ప్రయోగం**

ఈ కబురు, సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) తొలిసారి సంయుక్తంగా రూపొందించిన నాసా-ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ ఎఫ్-16) రాకెట్ ద్వారా 2,392 కేజీల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి సోమవారం రాత్రి మిషన్ రెడీ రివ్యూ (ఎంఆర్ఆర్) నిర్వహించారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలకు తుది తనిఖీలు నిర్వహించి రాకెట్ సంసిద్ధం చేసి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)కు అప్పగించారు. ల్యాబ్ ఆధ్వర్యంలో రాకెట్‌కు లాంచ్ రిహార్సల్స్ నిర్వహించి మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగాన్ని నిర్వహించేందుకు సిద్ధం చేశారు.

# విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు టెండర్లు

ఈ కబురు: విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టు పనులకు రాష్ట్ర మెట్రోరైల్ కార్పొరేషన్ సోమవారం టెండర్లు పిలిచింది. తొలిదశలో 4.33 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ నాలుగు లైన్ల పైవంతెన సహా మొత్తం 38.40 కి.మీ.తో రెండు కారిడార్ల పనులు చేపట్టనున్నారు. ఇందుకు రూ.4,150 కోట్ల వ్యయం కానుంది. 32 చోట్ల ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు, ఒకచోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ నిర్మాణానికి ఈపీసీ విధానంలో మెట్రో రైల్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. సాంకేతిక, ఆర్థికాంశాలను పరిశీలించి గుత్తేదారు సంస్థలను ఎంపిక చేసిన అనంతరం ఈ ఏడాది సెప్టెంబరు 12 నుంచి బిడ్ల స్వీకరణ మొదలై అదే నెల 17న ముగియనుంది. అదేరోజు టెండర్లు తెరవనున్నారు. గుత్తేదారు సంస్థల అర్హతలపై మెట్రోరైల్ కార్పొరేషన్ నాలుగైదు రోజుల్లో మరో నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పనుల విలువకు సంబంధించిన వివరాలతో సోమవారం నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి కాంపిటీటీవ్ బిడ్డింగ్ కావడంతో ప్రాజెక్టుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అధ్యయనం చేసేందుకు గుత్తేదారు సంస్థలకు 45 రోజులపాటు సమయం ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆసక్తి కలిగిన సంస్థలు మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులను వర్చువల్‌గా సంప్రదించే వెసులుబాటు కల్పించారు. విశాఖలోనూ తొలి దశలో 46.23 కిలోమీటర్లలో మూడు కారిడార్ల పనులకు ఈ నెల 25న టెండర్లు పిలిచారు.





# అమ్మకాల ఒత్తిడి.. బేర్‌మన్న మార్కెట్లు

బ్యాంకింగ్, ఐటీ, రియల్టీ కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడితో బెంచ్ మార్క్ భారతీయ ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 572.07 పాయింట్లు (0.70 శాతం) క్షీణించి 80,891 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 156.10 పాయింట్లు లేదా 0.63 శాతం క్షీణించి 24,680.90 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ అనుబంధ షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ మాత్రమే 1.23 శాతం వరకు లాభపడగా, మిగతావి నష్టాల్లో స్థిరపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 1.14 శాతం నుంచి 7.31 శాతం మధ్య నష్టాల్లో ముగిశాయి.

నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.26 శాతం, 0.84 శాతం నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా ఎన్ఎస్ఈలోని ఇతర సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ రెడ్‌లో స్థిరపడగా, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 4.26 శాతం నష్టంతో ముగిసింది.

# కైనెటిక్ కొత్త స్కూటర్.. తిరిగొచ్చిన మరో ఐకానిక్ బండి



**లూనా తర్వాత కైనెటిక్ నుంచి మరో ఐకానిక్ బండి తిరిగి కొత్తగా మార్కెట్లోకి వస్తోంది. కైనెటిక్ డీఎక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ భారత్‌లో లాంచ్ అయింది. దీని ప్రారంభ ధర రూ .1.12 లక్షల నుంచి రూ.1.18 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఈ స్కూటర్ డీఎక్స్, డీఎక్స్+ అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 116 కిలో మీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.**

ఈ డీఎక్స్ స్కూటర్‌కు కైనెటిక్ గ్రీన్ మూడు సంవత్సరాలు లేదా 30,000 కిలోమీటర్ల ప్రామాణిక వారంటీని అందిస్తోంది. దీంతోపాటు తొమ్మిది సంవత్సరాలు లేదా లక్ష కిలోమీటర్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ ఎంచుకునే అవకాశం వినియోగదారులకు ఉంది. వైట్, బ్లూ, బ్లాక్, సిల్వర్, రెడ్ రంగుల్లో ఈ స్కూటర్ అందుబాటు ఉంటుంది.
జూలై 28 నుంచి ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కొనుక్కోవాలనుకుంటున్నవారు రూ .1,000 టోకెన్ మొత్తాన్ని చెల్లించి ఈవీని బుక్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. 2025 అక్టోబర్‌లో డెలివరీలు ప్రారంభమవుతాయి. అయితే డెలివరీలను 40,000 యూనిట్లకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు కైనెటిక్ గ్రీన్ వెల్లడించింది.
ఈ ఏడాది ప్రారంభంలో లాంచ్ అయిన లూనాతో పాటు కైనెటిక్ తన బ్రాండ్ కింద రెండవ ఐకానిక్ నేమ్ ప్లేట్ ను పునరుద్ధరించింది. భారత్‌కు చెందిన కైనెటిక్ ఇంజనీరింగ్, జపాన్ కు చెందిన హోండా మోటార్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంలో 1984 నుండి 2007 మధ్య కైనెటిక్ డీఎక్స్ స్కూటర్లు ఉత్పత్తి అయ్యాయి. హోండా ఎన్‌హెచ్ సిరీస్ స్కూటర్ల కింద రూపొందిన ఆ స్కూటర్ 98 సీసీ టూస్ట్రోక్, ఎయిర్ కూల్డ్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇప్పుడిది ఎలక్ట్రిక్ మోడల్‌గా తిరిగి రోడ్డెక్కుతోంది.

# సోషల్ మీడియాలో రిఫైన్డ్ వంట నూనెలపై 'తప్పుదారి పట్టించే' కంటెంట్



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో శుద్ధి చేసిన వంట నూనెలకు సంబంధించి తప్పుదారి పట్టించే కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని పరిశ్రమ సమాఖ్య సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ), ఫుడ్ సేఫ్టీ రెగ్యులేటర్ ఎఫ్ఎస్ఎస్ఏఐలను కోరింది. ఈ మేరకు సీసీపీఏ, ఎఫ్ఎస్ఎస్ఏఐకు లేఖ రాసింది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అకౌంట్ పోస్ట్ చేసిన వైరల్ వీడియోను ఎస్ఈఏ ప్రస్తావించింది. అందులో ఆందోళన కలిగించే, కొంచెం కూడా వాస్తవం కానీ విషయాలు చెప్పారని, రిఫైన్డ్ వంట నూనెలు రసాయనాలతో నిండి ఉంటాయని, విషపూరితమనే తప్పుడు లేబులింగ్ చేస్తున్నారని పేర్కొంది. ఆ వీడియో ఎక్కువమంది యూజర్లకు చేరుతోందని, దానివల్ల సామాన్యులు అది నిజమని నమ్మే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. మనదేశంలో ఎక్కువమంది ప్రజలు వంట నూనెల్లో రిఫైన్డ్ చేసిన వాటినే వాడుతున్నారు. ఇలాంటి వీడియోల కారణంగా రిఫైన్డ్ వంట నూనెల భద్రతపై సందేహాలు నెలకొంటాయని వివరించింది. ఇలాంటి తప్పుడు సమాచారం వినియోగదారుల విశ్వాసాన్ని మాత్రమే కాకుండా రైతుల జీవనోపాధిని, దేశ ఆహార భద్రతా పర్యావరణంపై విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తుందని అసోసియేషన్ హెచ్చరించింది. ప్రజలకు ఖచ్చితమైన, శాస్త్రీయ ఆధారిత సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

# శరవేగంగా ఆన్‌లైన్ షాపింగ్

దేశంలో ఆన్‌లైన్ షాపింగ్ ధోరణి పెరుగుతోంది. గతంలో ఉన్నట్టు బయటకు వెళ్లి రిటైల్ స్టోర్లలో కొనేందుకు సమయం లేకపోవడం, ఆన్‌లైన్‌లో ఆఫర్ల కారణంగా ఆన్‌లైన్‌లో కొనే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భవిష్యత్తులో భారత ఈకామర్స్ రంగం మరింత వేగంగా వృద్ధిని సాధించనుందని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ మెకెన్సీ వెల్లడించింది. తాజాగా సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. భారత్‌లో 850 మిలియన్ల (85 కోట్లు) మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. ప్రస్తుతం వారిలో కేవలం 2025 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేస్తున్నారు.



దీనర్థం రానున్న రోజుల్లో ఆన్‌లైన్ షాపింగ్‌కు మరింత వృద్ధి సాధించగల సత్తా ఉంది. అమెరికా, చైనాలతో పోల్చుకుంటే మనదేశంలో ఇంటర్నెట్ వాడుతున్న వారికి, ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్న వారికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉంది. యూఎస్, చైనాలలో 85 శాతం కంటే ఎక్కువ మంది ఇంటర్నెట్ యూజర్లు ఈషాపింగ్ చేస్తారు. దీన్ని బట్టి మనదేశంలోనూ ఇంటర్నెట్ వాడుతున్న వారికి అనుగుణంగా ఆన్‌లైన్ షాపింగ్ పెరిగితే ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నట్టే. గత కొన్నేళ్లలోనే దేశీయ ఈకామర్స్ కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతోందని నివేదిక అభిప్రాయపడింది.

**క్విక్-కామర్స్ ఎఫెక్ట్**
భారత్ ఆన్‌లైన్ షాపింగ్‌ను వేగంగా స్వీకరించే దేశంగా మాత్రమే కాకుండా, ఈ రంగంలో కొత్త ఇన్నోవేటర్‌గా కూడా అభివృద్ధి చెందుతోంది. చాలా తక్కువ సమయంలో వస్తువులను డెలివరీ చేసే క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల పెరుగుదల ఇందుకు దోహదపడనుంది. అయితే, 2023 నాటికి భారత మొత్తం రిటైల్ అమ్మకాలలో ఈకామర్స్ వాటా ఇప్పటికీ 7 నుంచి 9 శాతం మాత్రమే ఉంది. ఈ వాటా 2030 నాటికి రెట్టింపు కంటే ఎక్కువగా 15 17 శాతం మధ్య ఉంటుందని అంచనా. ఇది దేశంలో ఆన్‌లైన్ షాపింగ్ విస్తరణకు ఉన్న భారీ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.
ముఖ్యంగా కొత్త బిజినెస్ మోడల్స్ దేశంలో ఈకామర్స్ పరిశ్రమ రూపురేఖలను మారుస్తున్నాయి. క్విక్‌కామర్స్, సోషల్ కామర్స్ కలిసి నేటి ఈకామర్స్ మార్కెట్లో 15 శాతానికి పైగా ఉన్నాయి. 2030 నాటికి వీటి వాటా 25 శాతానికి మించి ఉంటుందని అంచనా నివేదిక అంచనా కట్టింది. ఈకామర్స్ కంపెనీలు వినియోగదారులకు సేవలందించేందుకు కొత్త మార్గాలను కూడా అన్వేషిస్తున్నాయి. అవి దేశీయంగా సేవలకు ఇన్‌స్టంట్ బుకింగ్‌లు, వృత్తిపరమైన సహాయం, వైద్య సహాయం వంటి కొత్త విభాగాల్లోకి విస్తరిస్తున్నాయి.

**చిన్న నగరాల్లో ఎక్కువ డిమాండ్**
భారతీయ ఈకామర్స్‌లో తదుపరి వృద్ధికి రెండు ప్రధాన కారకాలు ఉన్నాయి. ఒకటి బీ2బీ (బిజినెస్ టుబిజినెస్) కామర్స్, నిర్మాణ సామగ్రి వంటి కొత్త విభాగాలలోకి ప్రవేశించడం. మరొకటి టైర్2, టైర్3 నగరాల నుంచి పెరుగుతున్న డిమాండ్. ఈ నగరాలు మెట్రో, టైర్‌వన్ నగరాల కంటే వేగంగా ఆదాయ పెరుగుదలను చూస్తున్నాయి. టైర్2 నగరాల్లో నెలవారీ ఆదాయాలు 20232024 మధ్య 18 శాతం పెరిగాయి. ఇది పెద్ద సిటీల్లో కనిపించే వృద్ధి కంటే ఎక్కువని నివేదిక తెలిపింది. దేశంలో ఈకామర్స్ సాంప్రదాయ రిటైల్ రంగానికి మించి వృద్ధి సాధించనుందని నివేదిక అభిప్రాయపడింది. ఇది లాస్ట్ మైల్ డెలివరీ, లాజిస్టిక్స్ వంటి రంగాలతో సహా మొత్తం రిటైల్ వ్యవస్థను పునర్నిర్మిస్తుందని నివేదిక పేర్కొంది.

# దేశంలో స్టార్‌లింక్ 20 లక్షల కనెక్షన్‌లను మాత్రమే ఇవ్వగలదు: టెలికాం శాఖ




బిలియనీర్ ఎలన్ మస్క్ నేతృత్వంలోని శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కంపెనీ స్టార్‌లింక్ భారత్‌లో 20 లక్షల కనెక్షన్‌లను మాత్రమే ఇవ్వగలదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం వెల్లడించారు. అలాగే, గరిష్ఠంగా 200ఎంబీపీఎస్ ఇంటర్నెట్ స్పీడ్‌ను ఇస్తుందని తెలిపారు. ఇదే సమయంలో స్టార్‌లింక్ సేవలు భారత్‌లోకి అడుగుపెట్టడం వల్ల దేశీయ బీఎస్ఎన్ఎల్ సహా మన ప్రైవేట్ టెలికాం కంపెనీలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. స్టార్‌లింక్ సేవలు మొదట్లో ఖర్చు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నెలకు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ కోసం రూ. 3,000 వరకు వెచ్చించాల్సి ఉంటుందని మంత్రి వివరించారు. అదే బీఎస్ఎన్ఎల్ అధిక ఉనికిని కలిగిన గ్రామీణ, మారుమూల ప్రాంతాలే లక్ష్యంగా శాట్‌కామ్ సేవలందించాలని భావిస్తున్నాం . ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల విస్తరణ పూర్తయింది. స్టార్‌లింక్ కనెక్షన్లు దాని ప్రస్తుత సామర్థ్యం ఆధారంగా పరిమితం చేసినట్టు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ విషయంలో మార్కెట్ వాటాను పెంచుకునే దిశగా నిర్ణయాలు ఉంటాయని, ఇప్పటివరకైతే బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి టారిఫ్‌లను పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చంద్రశేఖర్ వెల్లడించారు. 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ ఆదాయం 2030 శాతం పెరిగింది. టెక్నాలజీ పరంగా కూడా మెరుగుపడుతోందన్నారు.

# టాటా కంపెనీకి డిమాండ్ నోటీసు.. రూ.7,800 కోట్లు బాకీ




సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిలు సుమారు రూ.7,800 కోట్లు చెల్లించాలని కోరుతూ టాటా కమ్యూనికేషన్స్‌కు టెలికాం విభాగం షోకాజ్ కమ్ డిమాండ్ నోటీసు జారీ చేసింది. ఇవి 200506 నుంచి 202324 మధ్య కాలానికి సంబంధించిన ఏజీఆర్ బకాయిలుగా డిమాండ్ నోటీసులో పేర్కొంది.'200506 నుంచి 2023 24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,827.55 కోట్ల షోకాజ్ కమ్ డిమాండ్ నోటీసులు భారత టెలికమ్యూనికేషన్స్ విభాగం నుంచి జూన్ 30, 2005 నాడు అందాయి' అని టాటా కమ్యూనికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏఎస్ లక్ష్మీనారాయణ్ తెలిపారు. ఇందులో ఐఎస్పీ (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్) లైసెన్స్ కింద 201011 ఆర్థిక సంవత్సరానికి, ఎన్ఎల్‌డీ (నేషనల్ లాంగ్ డిస్టెన్స్) లైసెన్స్ కింద 2007, 2010 ఆర్థిక సంవత్సాలకు కంపెనీ క్లెయిమ్ చేసిన మినహాయింపులు రూ .276.68 కోట్లను కూడా పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. అయితే ఐఎల్‌డీ (ఇంటర్నేషనల్ లాంగ్ డిస్టెన్స్), ఎన్ఎల్‌డీ, ఐఎస్పీ లైసెన్సులకు సంబంధించి టాటా కమ్యూనికేషన్స్ గతంలో దాఖలు చేసిన అప్పీళ్లు సుప్రీంకోర్టు, టెలికాం ట్రిబ్యునల్ టీడీఎస్ఏటీ వద్ద పెండింగ్ లో ఉన్నాయి. పాత టెలికాం లైసెన్స్ విధానం యూఏఎస్ఎల్ కింద ఏజీఆర్‌పై 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కంపెనీ అప్పీళ్లను ప్రస్తావించలేదని లక్ష్మీనారాయణ్ తెలిపారు. కాబట్టి తమ లైసెన్సులు యూఏఎస్ఎల్‌కి భిన్నమని కంపెనీ భావిస్తోందని, స్వతంత్ర న్యాయ అభిప్రాయాల ఆధారంగా తన స్థానాన్ని సమర్థించుకోగలదని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# సునీల్ శెట్టిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు



**బాలీవుడ్ హీరో సునీల్ శెట్టి ఓ వివాదంలో చిక్కుకున్నారు. భార్యాభర్తల మధ్య బాధ్యతల విభజన గురించి ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలే దీనికి కారణమయ్యాయి. భర్త తన కెరీర్ మీద దృష్టిపెడితే, పిల్లల ఆలనాపాలన బాధ్యతను భార్య తీసుకోవాలని సునీల్ శెట్టి సూచించాడు. నటుడు ఈ అభిప్రాయం వెల్లడించిన నేపథ్యంలో, అతడిపై సోషల్‌మీడియాలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.**

'ఈ రోజుల్లో యువతలో ఓపిక ఉండటం లేదు. పెళ్లైన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. కొన్ని విషయాల్లో రాజీ పడాలి. పరస్పరం మద్దతుగా నిలవాలి. వారి జీవితంలోకి పిల్లలు వచ్చాక.. వారి ఆలనాపాలనా బాధ్యతలను భార్య తీసుకోవాలి. అప్పుడు భర్త తన కెరీర్ మీద దృష్టిపెట్టే అవకాశం ఉంటుంది. అలాగే భర్త కూడా ఈ విషయంలో కాస్త బాధ్యత తీసుకోవాలి. కానీ ప్రస్తుత కాలంలో అన్ని విషయాల్లోనూ తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది' అని సునీల్‌శెట్టి ఓ ఇంటర్వ్యూలో అన్నారు.
ఆయన చేసిన ఈ వ్యాఖ్యల మీద సోషల్ మీడియా వేదికగా చాలామంది భిన్నాభిప్రాయాలు, వ్యతిరేకతను వ్యక్తంచేశారు. 'ఆయన మాట్లాడటం ఆపేయాలి' అని ఒకరంటే, 'తన ఇమేజ్‌ను తానే డ్యామేజ్ చేసుకుంటున్నాడు' అని మరో యూజర్ కామెంట్ చేశాడు. 'కొన్నిసార్లు మౌనంగా ఉండటం మంచిది. ఈవిషయమై ఆయనకు పీఆర్ టీమ్ కానీ, చుట్టూ ఉండేవారు కానీ సలహాలు, సూచనలు ఇవ్వరా?' అని ఇంకో వ్యక్తి కామెంట్ చేశాడు.

'సినిమాల్లో ఆయన పోషించే పాత్రలను చూసి మోసపోకండి. సునీల్ శెట్టి 60 ఏళ్లు పైబడిన వ్యక్తి. తన జనరేషన్‌లోని వ్యక్తుల్లాగే అతడూ పాత ఆలోచనలను పంచుకుంటాడు' అని మరో సోషల్ మీడియా యూజర్ కాస్త ఘాటుగానే స్పందించాడు. 'ఆయన వ్యాఖ్యలు పురుషాధిక్య మనస్థత్వానికి, అహంకారానికి అద్దం పడుతున్నాయి. నిజాయతీగా చెప్పాలంటే ఆయన మాట్లాడటం మానేయాలి' అని మరో వ్యక్తి సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

సునీల్ శెట్టి ప్రస్తుతం అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో స్ట్రీమ్ అవుతున్న 'హంటర్ 2'లో కనిపిస్తున్నారు. ఇందులో ఆయన కిడ్నాప్‌నకు గురైన తన కూతురిని రక్షించుకునే ఏసీపీ విక్రమ్‌సిన్హా పాత్రలో నటిస్తున్నారు.

# నా చిరకాల కోరిక అదే.. శృతిహాసన్ బోల్డ్ కామెంట్స్ !



**టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో బ్యాక్ గ్రౌండ్ ఉన్న వాళ్ళు ఉన్నారు... అలాగే సొంతగా పైకి వచ్చిన వాళ్లు కూడా ఉన్నారు. ఇక కమల్ హాసన్ కూతురుగా.. ఇండస్ట్రీలోకి వచ్చి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు శృతి హాసన్ . ముఖ్యంగా పవన్ కళ్యాణ్ హీరోగా చేసిన గబ్బర్ సింగ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసి.. ఇండస్ట్రీలో అగ్రశ్రేణి హీరోయిన్ గా మారిపోయారు.**

**అయితే అలాంటి హీరోయిన్ శృతి హాసన్.. తాజాగా తన డ్రీమ్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు సంగీతం అంటే ప్రాణమని... సినిమాలలో ఓ మ్యూజిషియన్ పాత్ర చేయాలన్నదే తన చివరి కోరిక అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు ఈ అందాల తార. మంచి కథలు వస్తే కచ్చితంగా... సినిమాలు చేస్తానని పేర్కొన్నారు. ఇండస్ట్రీలో.. ఎలాంటి హీరో అయినా తనకు సంబంధం లేదని.. కథలో దమ్ము ఉంటే కచ్చితంగా సినిమా ఒప్పకుంటానని వివరించారు. ఇది ఇలా ఉండగా.. ఈ అందాల తార శృతిహాసన్ హీరో రజనీకాంత్ చేస్తున్న కూలీ సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఈ భారీ యాక్షన్ డ్రామా సినిమా ఆగస్టు 14వ తేదీన రిలీజ్ కానుంది. ఇందులో నాగార్జున విలన్ గా కనిపించనుండగా.. ఉపేంద్ర, అమీర్ ఖాన్, సత్యరాజ్ లాంటి వారు కూడా ఉన్నారు.**

# ఆ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని.. తిరిగి వారి కుటుంబానికే ఇచ్చేశా: సంజయ్‌దత్



తనకు గతంలో ఓ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని తాను తిరిగి వారి కుటుంబానికే ఇచ్చివేసినట్లు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 2018లో వార్తల్లో నిలిచిన ఈ విషయం గురించి ఆయన మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోన్న నిషా పాటిల్ అనే అభిమాని అప్పట్లో తన ఎస్టేట్ మొత్తాన్ని సంజయ్ దత్ పేరిట రాశారు. ఆమె తన తదనంతరం సంపదనంతా సంజయ్‌కు బదిలీ చేయాలని బ్యాంకుకు కూడా సూచించినట్లు సమాచారం. అయితే సంజయ్ దత్ ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు. 'నేను ఆ ఆస్తిని ఆమె కుటుంబ సభ్యులకే ఇచ్చేశా' అని తేల్చి చెప్పారు.

ఈ సంవత్సరం ప్రారంభంలో విడుదలైన 'భూత్నీ', 'హౌస్‌ఫుల్ 5' బాలీవుడ్ చిత్రాల్లో సంజయ్ దత్ నటించారు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'అఖండ 2'లోనూఆయన కనిపించనున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది.


# చాలుచాల్లేవమ్మ.. చెబుతే నమ్మేలా ఉండాలి.. నువ్వూ నీ ఏతులు.. అనసూయకు ఇచ్చిపడేసిన నెటిజన్స్

**యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన అనసూయ ప్రస్తుతం స్టార్ హీరోయిన్లకు ఉన్నంత క్రేజీని సొంతం చేసుకుంది. జబర్దస్త్ కామెడీ షోతో మోస్ట్ పాపులర్‌గా మారిన అనసూయ.. రంగస్థలంలో రంగమ్మ అత్తగా ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఆ తర్వాత పుష్పతో పాన్ ఇండియా నటిగా గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలో లక్షల మంది ఫాలోవర్లను సొంతం చేసుకున్న ఈ ద్రాక్షాయని.. నిత్యం అభిమానులకు టచ్ ఉంటూ తన అప్ డేట్స్ ఇస్తుంది. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే అను.. ట్రోలర్స్‌కు గట్టిగానే సమాధానం ఇస్తుంది. తనపై అసభ్యకరంగా ఎవరైనా కామెంట్స్ చేస్తే తగ్గేదేలే అంటూ వారిపై విరుచుకుపడుతుంది. అనసూయకు అస్సలు నచ్చని పదం ఆంటీ.. ఆంటీ అంటూ ఎవరైనా పిలిచినా.. కామెంట్స్ చేసినా రచ్చరచ్చ చేస్తుంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనను ట్రోల్ చేసే 30 లక్షల మంది ఫాలోవర్స్‌ను బ్లాక్ చేశానని చెప్పుకొచ్చింది. అడ్డమైన కామెంట్స్ పెడితే నేను ఏమాత్రం తగ్గనని పేర్కొంది. అయితే ఈ కామెంట్సే మళ్లీ అనసూయను ట్రోలింగ్‌కు గురి చేస్తున్నాయి. అనసూయ ఇన్ స్టాగ్రామ్ ఖాతాకు 16 లక్షల మంది ఫాలోవర్స్ మాత్రమే ఉన్నారని, కానీ ఆమె మూడు మిలియన్ల మందిని ఎలా బ్లాక్ చేస్తుందని ప్రశ్నిస్తున్నారు. చెబితే నమ్మాలని.. ఏతులు ఎందుకు చెబుతున్నావని ట్రోల్ చేస్తున్నారు. కామెంట్ చేసే ముందు నీ ఫాలోవర్స్ ఎంతమంది ఉన్నారో చూసుకోవాలని సూచిస్తున్నారు. మరి ఈ కామెంట్స్‌పై ఈ ఐటెమ్ 'అను'బాంబ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.**



# అప్పటి 'షోలే' టికెట్ ఫొటోను అభిమానులతో పంచుకున్న బిగ్‌బీ






**బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్ ప్రతి ఆదివారం ముంబయిలోని తన నివాసం వెలుపల అభిమానులను పలకరిస్తారు. దశాబ్దాలుగా ఆయన ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. జులై 27న కూడా ఆయన తన ఫ్యాన్‌స్‌ను పలకరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన తన బ్లాగ్‌లో పంచుకున్నారు. అలాగే 1975లో విడుదలైన క్లాసిక్ మూవీ 'షోలే' టికెట్ చిత్రాన్ని కూడా ఆయన షేర్ చేశారు.**

అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్‌లో పంచుకున్న 'షోలే' సినిమా టికెట్ ధర రూ.20గా ఉంది. సినిమా విడుదలై దాదాపు అయిదు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ బిగ్‌బీ ఇప్పటికీ ఆ టికెట్‌ను దాచుకున్నారు. 'షోలే టికెట్‌ను జాగ్రత్తగా భద్రపరిచాను. దాని ధర అప్పట్లో రూ.20. నాకు తెలిసి ఇప్పుడు ఆ డబ్బుతో థియేటర్‌లో ఓ సాఫ్ట్ డ్రింక్ మాత్రమే కొనుక్కోగలం. నిజమేనా?' అని ఆయన రాసుకొచ్చారు. అయితే ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో కూల్‌డ్రింక్ ధర ఇంకా చాలా ఎక్కువగా ఉంది. అమితాబ్ బచ్చన్.. ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఏడీ' అనే పాన్ ఇండియా చిత్రంలో అశ్వత్థామగా కనిపించారు. ఈ సినిమాలో ప్రభాస్ , దీపికా పదుకొణె , కమల్ హాసన్ తదితరులు నటించారు. ఈ సినిమా సీక్వెల్‌లోనూ బిగ్‌బీ నటించనున్నారు. అలాగే థ్రిల్లర్ 'సెక్షన్ 84'లోనూ అమితాబ్ కనిపించనున్నారు.



# నటికి అత్యాచార బెదిరింపులు.. ఆ హీరో అభిమానులపై కేసు!

నటుడు దర్శన్ అభిమానులు తనను ఆన్‌లైన్‌లో వేధిస్తున్నారంటూ నటి రమ్య (దివ్య స్పందన) ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ యుగంలో సోషల్‌మీడియాను ఇలా ఉపయోగించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో అత్యాచార బెదిరింపులు రావడం దారుణమన్నారు.

"ఈ బెదిరింపులపై నా లాయర్‌తో ఇప్పటికే చర్చించాను. నాకు వచ్చిన బెదిరింపుల మెసేజ్‌లను పోలీసుల దృష్టికి తీసుకువెళ్తాను. ఆ కామెంట్స్ చేసిన వారిపై ఫిర్యాదు చేస్తాను" అని తెలిపారు. గతంలోనూ ఆమె ఇలాంటి వేధింపుల గురించి మాట్లాడారు. ఇలా చేసే వారు తప్పించుకొని తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కామెంట్స్ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయన్నారు.

రేణుకాస్వామి హత్య కేసుపై రమ్య ఇటీవల ఓ పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్‌కు దర్శన్ అభిమానులు తనకు అసభ్యకరమైన కామెంట్స్ పెట్టారని నటి తెలిపారు. 'రేణుకాస్వామికి బదులుగా నిన్ను హత్య చేసి ఉండాల్సింది. అత్యాచారం చేస్తాం' అంటూ ఎంతోమంది నటుడి అభిమానులు తనకు మెసేజ్‌లు పంపినట్లు చెప్పారు. ఆ మెసేజ్‌ల స్క్రీన్‌షాట్‌లను కూడా ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నారు. తన కుటుంబ సభ్యులను కూడా వారు వదలడం లేదని బాధపడ్డారు. 'అభిమన్యు' సినిమాతో తెలుగు వారికి పరిచయమైన రమ్య.. ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్నారు.



# 'తిరిగొస్తా.. తిరిగిస్తా'.. రిషబ్ పంత్ ప్రకటన

మాంచెస్టర్ వేదికగా జరిగిన టెస్టులో భారత స్టార్ ప్లేయర్ రిషబ్ పంత్‌కు గాయమైన విషయం తెలిసిందే. దీంతో మొత్తం సిరీస్‌కు దూరమయ్యాడు. మరోవైపు ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ గాయంతోనే క్రీజ్‌లోకి వచ్చి హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అవసరమైతే పంత్ బ్యాటింగ్‌కు వస్తాడని బీసీసీఐ ముందే చెప్పింది. కానీ, ఆ అవసరం రాకుండానే భారత బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. గాయం కారణంగా రిషభ్ పంత్ ఐదో టెస్టుకు దూరమైన క్రమంలో భారతజట్టుకు తన సందేశం ఇచ్చాడు. నా జీవితంలో గొప్ప క్షణం ఏదైనా ఉంది అంటే.. అది దేశం కోసం ఆడే సమయమే. గాయం తగ్గగానే మెల్లగా ప్రాక్టీస్ మొదలు పెడతా.. మళ్లీ వందశాతం తిరిగొస్తా.. వందశాతం తిరిగి ఇస్తానని రిషబ్ పంత్ ప్రకటించారు. ఆరోజు కోసం ఎదురుచూస్తాను అని పేర్కొన్నారు. ఇదే క్రమంలోనే చివరి టెస్టు గెలిచేందుకు ప్రయత్నిద్దామని జట్టు సభ్యులకు సూచించారు.







# పియాస్త్రి 'సిక్సర్'

**ఈ సీజన్‌లో ఆరో టైటిల్ గెలిచిన మెక్‌లారెన్ డ్రైవర్**
**బెల్జియం గ్రాండ్‌ప్రిలో అగ్రస్థానం సొంతం**

**స్పా–ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం):** ఫార్ములా వన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్‌ల జోరు సాగుతోంది. ఆస్కార్ పియాస్ట్రి, లాండో నోరిస్ మధ్య ఆధిక్యం చేతులు మారుతూ సాగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజయం సాధించాడు. ఈ సీజన్‌లో పియాస్ట్రికిది ఆరో విజయం కావడం విశేషం. ఆదివారం జరిగిన ఈ రేసులో పియాస్ట్రి నిర్ణీత 44 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 25 నిమిషాల 22.601 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు.

మెక్‌లారెన్ జట్టుకే చెందిన నోరిస్ 1 గంట 25 నిమిషాల 26.016 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. పోల్ పొజిషన్‌తో రేసును ప్రారంభించిన నోరిస్... 3.415 సెకన్ల తేడాతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. వర్షం అంతరాయం కారణంగా షెడ్యూల్ కన్నా ఆలస్యంగా ప్రారంభమైన రేసులో ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 25 నిమిషాల 42.786 సెకన్లు) మూడో స్థానం దక్కించుకున్నాడు.

నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 గంట 25 నిమిషాల 44.432 సెకన్లు; రెడ్‌బుల్) నాలుగో స్థానంతో సరిపెట్టుకోగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 26 నిమిషాల 3.280 సెకన్లు; ఫెరారీ) ఏడో స్థానానికి పరిమితమయ్యాడు. 24 రేసులో తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 13 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 266 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... నోరిస్ 250 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ 185 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. తదుపరి రేసు ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి ఆగస్టు 3న జరుగుతుంది.

# వీళ్లు ఆల్‌రౌండర్లే కాదు.. అంతకు మించి..





**పేస్ పిచ్‌లపై స్పిన్ ఆల్‌రౌండర్లు ఎందుకు? అందులోనూ ఇద్దరెందుకు? ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ముందు ఇవే ప్రశ్నలు. ఇప్పుడు నాలుగో టెస్టును భారత్ డ్రా చేసుకోవడంలో వాళ్లే కీలకమయ్యారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టారు.. తమ మీద కామెంట్లు చేసినవాళ్ల నోళ్లు మూయించారు.**

నలుగురు ఆల్‌రౌండర్లలో ఒకరిని తగ్గించి మరో బ్యాటర్‌నో, బౌలర్‌నో తీసుకుంటే బాగుండేది.. మాంచెస్టర్ టెస్టు జరుగుతున్న మొదటి నాలుగు రోజులూ చాలామంది క్రికెట్ అభిమానులు, కొందరు మాజీలు ఇదే అభిప్రాయంలో ఉన్నారు. కానీ, మ్యాచ్ ఫలితం వచ్చాక 'తామన్నది తప్పని.. టీమ్ ఆలోచన సరైనదే' అని మెచ్చుకుంటున్నారు. అంతా మన స్పిన్ ఆల్‌రౌండర్లు ఆపద్బాంధవులయ్యారు. ఈ మ్యాచే కాదు గత మ్యాచులోనూ ఈ స్పిన్ ఆల్‌రౌండర్లు తమ ముద్ర వేశారు. జడేజా అయితే సిరీస్ తొలి టెస్టు నుండి ఇలానే ఆడుతున్నాడు.

మాంచెస్టర్‌లో టెస్టులో ఓటమి ఖాయం అనుకున్న స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా, సుందర్ అద్వితీయ పోరాట పటిమ ప్రదర్శన కనబర్చారు. అంతకుముందు లార్డ్స్ టెస్టులోనూ జడేజా గొప్పగా పోరాడాడు. సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో జడేజా (454) నాలుగో స్థానంలో ఉన్నాడు, 7 వికెట్లూ తీశాడు. ఇది చాలు ఈ స్టార్ ఆల్‌రౌండర్ ఎంతలా ప్రభావం చూపించాడో అర్థం చేసుకోవడానికి. వాషింగ్టన్ సుందర్ కూడా సిరీస్‌లో భారత్‌కు కీలకంగా మారాడు. 3 మ్యాచ్‌లు ఆడి 205 పరుగులు చేసి 7 వికెట్లు తీశాడు. పేస్ పిచ్‌ల మీద ఇన్నేసి వికెట్లు అంటే పెద్ద విషయమే.

**ఇకపై వారిద్దరేనా?**

ఈ సిరీస్‌తో శార్దూల్ ఠాకూర్ పని అయిపోయినట్లే. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో నిలకడ లేదు. ఇదే అతడి కెరీర్‌ను ముగించే సిరీస్ అనే మాటలూ వినిస్తున్నాయి. ఇక జడేజా కెరీర్ ముగింపు దశలో ఉంది. మరో ఏడాదిలోపే రిటైర్మెంట్ ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇక కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్ 30ల్లోకి వచ్చేశారు. దీంతో ఆల్‌రౌండర్ విభాగం బాధ్యతలు మోసేది సుందర్, నితీశ్ రెడ్డే . వీరు ఇంకా పాతికేళ్లలోపే ఉన్నారు. కాబట్టి.. నిలకడగా ఆడితే మరో పదేళ్లు జట్టులో కీలక ఆటగాళ్లుగా ఎదగొచ్చు.

**వీరిపై కన్నేయాలి**

మాంచెస్టర్ టెస్టు అనుభవంతో ఆల్‌రౌండర్ల విషయంలో టీమ్‌ఇండియా ముమ్ముందు ఇదే పంథాను అనుసరించడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో. అయితే, భారత్ మరింత మంది ఆల్‌రౌండర్లను తయారు చేసుకోవడంపై దృష్టిపెట్టాలి. ఈ క్రమంలో తనుష్ కొటియన్, రాజ్ బవా, ముషీర్ ఖాన్, రాజ్యవర్ధన్ హంగర్గేకర్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ లాంటి పేర్లు కనిపిస్తాయి. వీరిని సుదీర్ఘ ఫార్మాట్‌లోకి తీసుకొచ్చి.. ఆల్‌రౌండర్లుగా మల్చుకోవాలి. విదేశీ స్టార్స్ కమిన్స్, మిచెల్ స్టార్క్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్ కూడా ప్రధానంగా బౌలర్‌గా ఉంటూ బ్యాటర్‌గానూ జట్టుకు సహకారం అందిస్తున్నారు. భారత్ కూడా ఇదే ఫార్ములాను అనుసరిస్తే ఆల్‌రౌండర్ల కొరత తీరుతుంది.

# చాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్

**ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో యువ తరంగం దివ్య దేశ్‌ముఖ్ సత్తా చాటింది. తెలుగు తేజం కోనేరు హంపి ని 2.5-1.5తో ఓడించి.. మహిళల చెస్ ప్రపంచకప్ టైటిల్ గెలిచిన భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.**





జార్జియాలోని బతూమీ వేదికగా సోమవారం జరిగిన టై బ్రేకర్‌లో హంపీ తొలుత నల్ల పావులతో ఆడగా.. దివ్యతో కలిసి డ్రా చేసుకుంది. పదిహేను నిమిషాల పాటు సాగిన గేమ్‌లో 81 ఎత్తుల తర్వాత ఇద్దరూ డ్రాకు అంగీకరించారు.

అనంతరం పదిహేను నిమిషాల రెండో ర్యాపిడ్ మ్యాచ్‌లో 38 ఏళ్ల హంపి తెల్ల పావులతో ఆడగా.. దివ్య నల్ల పావులతో ఎత్తులు వేసింది. అయితే, ఈ టై బ్రేక్‌లో 38 ఏళ్ల హంపి చేసిన తప్పిదాల ఫలితంగా 19 ఏళ్ల దివ్య చాంపియన్‌గా అవతరించింది.
ఈ గెలుపుతో దివ్య గ్రాండ్ మాస్టర్‌గా ప్రమోషన్ పొందడంతో పాటు.. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. ఇక హంపిపై గెలిచిన అనంతరం దివ్య తీవ్ర భావోద్వేగానికి లోనైంది.

**దివ్య భావోద్వేగం**

"ఇలా నేను గ్రాండ్ మాస్టర్ అవుతానని ఊహించలేదు. నా విధిరాతలో ఇది ఉంది. ఈ టోర్నమెంట్ ఆరంభానికి ముందు నాకు ఈ హోదా లేదు. ఈ విజయం నాకెంతో విలువైనది. ఇంకా నేను సాధించాల్సినవి చాలానే ఉన్నాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే" అంటూ దివ్య దేశ్‌ముఖ్ ఎమోషనల్ అయింది. ఈ సందర్భంగా దివ్య తల్లి ఆమెను అక్కున చేర్చుకుని.. విజయ గర్వంతో ఉప్పొంగిపోయారు. దివ్య కంటే ముందు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, ఆర్.వైశాలి గ్రాండ్ మాస్టర్ హోదా పొందారు.

**టై బ్రేకర్ ఇలా..**

టైబ్రేక్‌లలో 10 నిమిషాల చొప్పున రెండు రాపిడ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ప్రతి కదలిక తర్వాత 10 సెకన్ల ఇంక్రిమెంట్ ఉంటుంది. స్కోరు సమంగా ఉంటే, ప్రతి కదలిక తర్వాత మూడు సెకన్ల ఇంక్రిమెంట్‌లతో రెండు, ఐదు నిమిషాల మ్యాచ్‌లు ఆడతారు. టై కొనసాగితే, ప్రతి కదలిక తర్వాత రెండు సెకన్ల ఇంక్రిమెంట్‌లతో మూడు నిమిషాల చొప్పున రెండు బ్లిట్జ్ మ్యాచ్‌లు ఆడాలి.

# పంత్ స్థానంలో టీమ్‌ఇండియాలోకి.. నారాయణ్ జగదీశన్ రికార్డులివీ!

**ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో టెస్టు తొలి రోజు ఆటలో బ్యాటింగ్ చేస్తూ గాయపడిన రిషబ్ పంత్ .. చివరి (ఐదో) టెస్టుకు దూరమైన సంగతి తెలిసిందే. దీంతో పంత్ స్థానంలో నారాయణ్ జగదీశన్ ను ఎంపిక చేశారు. తమిళనాడుకు చెందిన ఈ 29ఏళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ త్వరలో ఇంగ్లాండ్ పయనమై జట్టుతో కలవనున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన నారాయణ్ జగదీశన్ భారత టెస్టు జట్టుకు ఎంపిక కావడం ఇదే తొలిసారి. ఇతనికి ఫస్ట్ క్లాస్‌లో మంచి రికార్డు ఉంది. 2016లో తొలి ఫస్ట్ క్లాస్ ఆడిన జగదీశన్ ఇప్పటివరకు 79 ఇన్నింగ్స్‌ల్లో 47.50 సగటుతో 3,373 రన్స్ చేశాడు. వీటిలో 10 సెంచరీలు, 14 హాఫ్ సెంచరీలున్నాయి.**



**జగదీశన్ రికార్డులివీ..**

రంజీ ట్రోఫీలో తమిళనాడు తరఫున వరుసగా రెండు సీజన్లలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు జగదీశన్. 202324లో 13 ఇన్నింగ్స్‌లలో 74.18 సగటుతో 816 పరుగులు, 202425లో 13 ఇన్నింగ్స్‌లలో 56.16 సగటుతో 674 పరుగులు చేశాడు. 202425 సీజన్‌లో చండీగఢ్‌పై 403 బంతుల్లో 23 ఫోర్లు, 5 సిక్స్‌ల సాయంతో 321 పరుగులు చేశాడు. దీంతో డబ్ల్యూవీ రామన్ (313) రికార్డును బ్రేక్ చేశాడు. ఇక, 2022 విజయ్ హజారే ట్రోఫీలో 8 మ్యాచ్‌ల్లో ఏకంగా ఐదు సెంచరీలు చేశాడు. అది కూడా వరుసగా. ఈ క్రమంలో 830 రన్స్‌తో టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇదే టోర్నీలో అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో జగదీశన్ 277 (141 బంతుల్లో) పరుగులు సాధించాడు. దీంతో లిస్ట్ ఎ మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరును నమోదు చేసిన ఆటగాడిగా అవతరించాడు.

జగదీశన్ ఐపీఎల్‌లో రెండు జట్ల తరఫున మొత్తం 13 మ్యాచ్‌లు ఆడాడు. 20182022 వరకు చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. సీఎస్కే తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడి 73 పరుగులు చేశాడు. 2023లో రూ.90 లక్షలకు కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో చేరాడు. ఆ సీజన్‌లో కేకేఆర్ తరఫున ఆరు మ్యాచ్‌ల్లో 89 రన్స్ చేశాడు.

**ఆడే ఛాన్స్ వస్తుందా?**

ధ్రువ్ జురెల్‌కు బ్యాకప్ వికెట్ కీపర్‌గా ఎంపికైన నారాయణ్ జగదీశన్ ఇంగ్లాండ్‌తో జరిగే ఐదో (చివరి) టెస్టులో ఆడటం కష్టమే! ఎందుకంటే భారత్‌కు ఐదో టెస్టు చాలా కీలకమైనది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌ను 22తో సమం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేయకపోవచ్చు. పైగా, జురెల్‌కు నాలుగు టెస్టులు ఆడిన అనుభవం ఉంది. జులై 31 నుంచి ఐదో టెస్టు మొదలుకానుంది. లండన్‌లోని ఓవల్ మైదానం ఈ మ్యాచ్‌కు వేదిక.